పతివ్రత

సౌందర్య అలంకరణను కళ్ళప్పగించి చూస్తున్నది కనకమ్మ. ఆమెకు సౌందర్య ఏ పని చేసినా అపురూపంగానే అనిపిస్తుంది-కనిపిస్తుంది.

ప్రతి పనిలోనూ ఒక్కొక్క హొయలు ఒక్కొక్క సొగసు నెక్ లెస్ వెనుక కొక్కెం తగిలిస్తూ అన్నది కనకం 'అబ్బ మీరీ చీరెలో రంభలా వున్నారండమ్మగారూ" ఈ పొగడ్త సౌందర్యకు తృప్తిని కలిగించలేదు సరికదా కోపకారణమైంది.

'రంభ ఎవరే?'

'అదేనండమ్మా'-

'ఏది?'

'పౌరాణిక సినిమాల్లో చూపిస్తారే-అది'

'అంటే'-

'అందంగా వుంటే రంభలా వుందంటారు ఊర్వశిలా వుందంటారు-'

'మూర్ఖులారా! వారంతా దేవవేశ్యలు-ఉత్తములు వారితో పోలిక తెచ్చుకో కూడదు'

ఫుల్ వాయిల్ చీరె చెంగు జఘనాలను దాటేవరకు విడిచింది.

సంప్రదాయికంగా బొట్టును తీర్చి దిద్దుకున్నది.

అనంతరం భర్తనొక్కసారి స్మరించుకొని మంగళసూత్రాలు కళ్ళకద్దుకొని మేడకిందికి చూచింది.

మోహనరావు ఇంకా రాలేదు.

కనకం నిట్టూర్చింది.

ఆ నిట్టూర్పు చాలా బరువుగా వుంది.

ఇది మొదటిసారి కాదు నీ భర్త నిన్నిలా మోసగించడం - అన్న అర్థం అందులో వుంది.

ఎన్నివుండి ఏం లాభం ఆయన సరిగ్గా టైం పాటించి వచ్చి ఆదరించనప్పుడు . అని మరో భావం.

ఇదే నేనైతేనా?-మాట తప్పితే ఆయన భరతం పట్టేదాన్ని - అన్న మరో ధ్వనీ-

ఇలా ఆ నిట్టూర్పు చాలా మాటలను నిశ్శబ్దగా చెప్పింది.

సౌందర్య మాత్రం చాలా నిర్లిప్తంగా చిరునవ్వు నవ్వింది.

ఆకాశంలోని పున్నమి చంద్రుణ్ణి చూస్తూ-

టెలిఫోన్ మ్రోగింది-

కనకం తీసుకొని 'అమ్మా అయ్యగారు పిలుస్తున్నారు' అన్నది-

సౌందర్య వెళ్ళి ఫోను తీసుకున్నది-

కనకానికి సౌందర్య చేసే ప్రతిపనీ వింతగానే కనిపిస్తుంది-

భక్తితో దేవాలయానికి అభిముఖంగా నడిచినట్లు నడుస్తుంది సౌందర్య ఎప్పుడు భర్తదగ్గరినుండి ఫోనువచ్చినా, భక్తురాలు దేవునితో మాట్లాడినట్లు మాట్లాడుతుంది సౌందర్య మోహనరావుతో ఫోనులోనైనాసరే - మోహనరావు చెప్పింది చెవులకు వినిపించక పోయినా కనకం సౌందర్యకన్నా స్పష్టంగానే ప్రతి మాటా మనస్సుతోనే విన్నది.

'సౌందర్యా! అర్జంటుపని తగిలింది- రాలేను. కావాలంటే నీవు కనకాన్ని తీసుకొని వెళ్ళు-లేదా రేపు వెళదాము ఇద్దరమూ.'

సౌందర్య ముఖంలో బాధ కన్పించలేదు-

కోపమూ ప్రతిబింబించలేదు.

చాలా సామాన్యంగా ఫోను పెట్టేసివచ్చి సోఫాలో మళ్ళీ కూర్చొని అన్నది

'ఏమే నిన్న పనిలోకి రాలేదు-'

'చెప్పానుగదమ్మా పొద్దున్నే -ఏదో దెబ్బలాట'

'ఎవరితోనే' నవ్వుతూ అడిగింది-

'ఎవడితో దెబ్బలాడితే ఏవడూరు కొంటాడమ్మగారూ-మావాడితోనే దెబ్బ లాడాను-తిక్కరేగి చివరకు రెండు ఇచ్చుకున్నాను-దాంతో వాడితల తిక్కుడు తగ్గి నోరుమూసుకొని మళ్ళీ పనిలోకి పోయాడు'

ఆమె తలమీద పిడుగుల వర్షం కురిసినట్లు భావించింది.

కనకం తన మొగుడు సీనును నాలుగు తన్నింది-

భార్య భర్తను తన్నింది-

స్త్రీ పురుషునిమీద చెయ్యిచేసుకున్నది.

ఇంతపని జరిగినా ఈ సృష్టి ఎందుకు స్తంభించి పోలేదనిపించింది సౌందర్యకు.

ఇటువంటి నీచురాలు తన ఇంట్లోపనికి కూడా అనర్హమని అనిపించింది. కాని గత్యంతరంలేదు.

కనకం తల్లీ తండ్రీ చనిపోతూ దిక్కులేని ఈ బిడ్డను మోహనరావు తల్లికి పనిపిల్లగా అప్పగించి వెళ్ళారు.

'పనిపిల్లగానో - పిల్లగానో ఎలా చూచుకున్నా ఇక మీదే భారం' అని కన్నుమూశారు.

కనకం ఈ గోడలమధ్యే పెరిగింది.

కనకం పెళ్ళికి మోహనరావు తండ్రి విజయసారథి ధనసహాయం చేశాడు.

పెళ్ళికాడు కుటుంబమంతా స్వయంగా ఆధ్వర్యం వహించి జరిపించారు.

శ్రీనివాసులు కూడా మంచివాడే!

కాని వాడికి మొదటినుంచీ తాగుడు అలవాటు వుంది - పస్తుకయితే కొంచెం చీట్లాటలోకూడా తగలేస్తాడు - కనకం కాపరానికి వచ్చినప్పటినుంచీ సీను ఈ స్వేచ్ఛను కొంత కోల్పోయాడు.

కనకం చాలా మనోనిబ్బరంకల మనిషి.

అందుకే ఏమీ చలించకుండా వాడిని చీట్లాడకుండా నిరోధించగలిగింది-

అందుకు డబ్బులు దొరకకుండా చేసింది.

కాని తాగుడు మాన్పించడం ఆమెకు సాధ్యపడటంలేదు.

అందుకే ఈ దెబ్బలాట.

దెబ్బలాటంటే తాగి మొగుడు కనకాన్ని కొడతాడని సౌందర్య భావించేది.

కాని అది అసత్యమనీ ఈవిడే స్త్రీజాతి మొత్తం తరతరాలుగా తలవంచుకునే పని చేస్తున్నదనీ సౌందర్యకిప్పుడే అర్థమైంది.

సౌందర్యకు కనకం సేవలను స్వీకరించే అర్హతేకాని దాన్ని పనిలోనుండి తొలగించేటంత అధికారంలేదు. అందుకే ఊరుకున్నది.

ఊరుకున్నదంటే కనకాన్ని వెళ్ళగొట్టకుండా ఊరుకున్నది,

అంతేకాని మాట్లాడకుండా ఊరుకోలేదు.

నీతిబోధ చెయ్యకుండా విరమించలేదు.

కనకం సౌందర్య చెప్పిన మాటలన్నీ భక్తిశ్రద్ధలతో విన్నది.

సౌందర్య కనకానికి సుమతి కథ చెప్పింది. అరుంధతి పుణ్యగాథను విపులీకరించింది. పాముగావున్న భర్తను ఆ బుట్టలో నెత్తిని పెట్టుకొని తీర్థాలు క్షేత్రాలూ మొత్తం దర్శించిన పుణ్యాత్మురాలి దివ్యగాథను గానంచేసింది.

కనకానికి ఈ కథలన్నీ కొత్తే.

ఆశ్చర్యపోయి అన్నది 'అమ్మగారూ - వాళ్ళంతా దేవుళ్లోళ్ళు - మనం మామూలు మనుషులం - మట్టిబొమ్మలం'.

'అజ్ఞురాలా - వాళ్లూ మనలాంటి మనుషులే - ఇంకా ఎక్కువ తపశ్శక్తి కలవారు - వారికి పాతివ్రత్యమే వ్రతం - అదే వారి తపస్సు. అందుండి వచ్చిన అగ్నికి సూర్యుడు గజగజ వణికి స్తంభించిపోతాడు. గ్రహాలూ ప్రకృతీ భగభగ భస్మీభూతమైపోతుంది - కనకం! అలాంటి స్త్రీజాతిలోనా నీవు పుట్టావు? నీను తాగితే తాగుతాడు మొగవాడు తాగుతాడు తిరుగుతాడు, వాడు మొగమహారాజు. మొగుడు. అడిగేందుకు నీకేం అధికారముంది?'

ఈ మాటల వెనుకవున్న మన స్తత్వం కనకం గ్రహించింది.

మోహనరావు క్లబ్బులో కొద్దిగా పుచ్చుకుంటాడు. చీట్లాడుతాడు - తన ఆఫీసులో పనిచేసే టైపిస్టుతో సినిమాకు వెళ్ళడం కూడా రహస్యమేమీకాదు.

అయినాసరే సౌందర్య కోపగించదు.

ఈ చిన్నచిన్న విఘ్నాలు ఆమెకు తపోభంగాన్ని కల్పించవు. ఋషులు తపస్సుచేస్తుంటే దేవేంద్రుడు అప్సరలను పంపి అవరోధాలను కల్పించేవాడట. ఇలాంటివే తన తపశ్శక్తిని పరీక్షించడంకోసం పరమేశ్వరుడు కల్పించాడని భావించింది సౌందర్య.

భర్త దక్షిణ నాయకత్వం తన ఆరాధనకూ తాదాత్మ్యమునకూ ఏమీ అవరోధం కలిగించలేదు - కనకం సౌందర్య తనకు చెపుతున్న నీతులు విన్నప్పుడు ఈ విషయాలన్నీ స్ఫురించాయి -

సౌందర్య దేవత!

ఆమెలో మానవాతీత శక్తులేవో వున్నాయి.

కాబట్టే ఆమె ఇలాంటి కఠినమైన వ్రతాన్ని నిర్వహించ గలుగుతున్నదని కనకం భావన.

ఆమాటే అన్నది 'అమ్మా మీరు దేవతలాంటివారు. నేనో అలగాదాన్ని. పనిచేసుకు బతికే మామూలు మనిషిని'

సౌందర్యకు కనకం సమాధానం తృప్తినివ్వలేదు.

ఆకాశంలో చంద్రుడు మరికొంచెం పైకివచ్చి వెండితీగెలవంటి తన కిరణాలను అమృతంతో తడిపి భూమ్యాకాశాలమధ్య ఒక అనుబంధాన్ని నిర్మిస్తున్నాడు.

ఆకాశంలోని చంద్రునిలా మెరిసిపోతున్న సౌందర్య భూమిపై తన కాళ్ళ దగ్గరే కూర్చున్న కనకంతో అన్నది.

'కనకం! చూడు.విధికి మనం కర్తలం కాము - అదంతా దేవుడి చేతిలోనే వుంటుంది - కేవలం మన ధర్మాన్ని నిర్వహించడమే మన బాధ్యత - నాకు మాత్రం బాధలూ భయాలూ లేవంటావా? కాని నేను నీలాగా బుద్ధిహీనురాలినిగా ప్రవర్తిస్తున్నానా?'

కనకం ఆశ్చర్యపడ్డది.

తనకూ సౌందర్యకూ పోలికా?

నిజం చెప్పాలంటే సౌందర్యకు ఏలోపమూలేదు. ఆర్థికంగా బాగానే వుంది వారి స్థితి.

ఓ ఎయిర్‌కూలర్, ఫ్రిజ్, మొజేయిక్ ఫ్లోరింగ్ గదుల్లో ధగధగ మెరిపే వెండి గిన్నెలూ స్టీలు సామాన్లూ డెకోలమ్‌వేసి ముట్టుకుంటే మాసిపోయినట్లుండే డైనింగ్ గదుల్లోని కాంతులూ.

లేటెస్టు మోడల్ కార్.

డ్రైవర్ - పనిమనిషీ - వంటమనిషీ.

సౌందర్యకు భౌతికమైన సిరిసంపదల్లో ఎలాంటి లోపమూలేదు.

భర్తను చూద్దామంటే అతిలోక సుందరుడు కాకపోయినా అనాకారి మాత్రం కాదు.

ముఖ్యంగా మొగవాడికి అందమైన విద్య వుంది.

భార్యంటే ఎంతో ప్రేమ.

దాన్నిమించిన గౌరవం - అభిమానం.

ఇక ఆమెసంగతి చూద్దామంటే అక్షరాలా ఏడువారాల నగలూ బండెడు టెర్లిన్ ఫారిన్, నైలెక్స్ చీరెలతో రతీదేవి శాపవశాన భూమిమీద సాకారంగా నడుస్తున్నదా అన్నట్లుండేది.

అలాంటిది, తనకూ సౌందర్యకూ పోలికేమిటి?? ఒకపూట తింటే రెండో పూట పిల్లలకు గంజి దొరుకుతుందనే కనీసపు హామీకూడాలేని తన జీవితానికి పాతివ్రత్యమూ. దానిద్వారా తపశ్శక్తిని సాధించడం సాధ్యమా?

కేవలం పురాణాల్లోని కథలవలె విని ఆనందించి అశ్రువులు రాల్చవలసిందే!!

అందుకే కనకం అన్నది 'ఈ పాతివ్రత్య వ్రతం అందరికీ అందుబాటులో లేని అందని ఓ మానుపండు అమ్మగారూ - నీవంటి అదృష్టవంతులూ పెట్టి పుట్టినవారే చేసే వ్రతం ఇది.'

కనకం స్కూలుచదువు చదువుకోకపోయినా సాంస్కృతికమైన విజయసారథిగారి కుటుంబ వాతావరణంలో పెరిగింది- కాబట్టే భావాలకూ భాషకూ ఆమెకు లోటులేదు-

ఈ మాటతో సౌందర్యకు కోపం వచ్చింది-

'వెర్రిమొగమా - మహాకార్యాలు సాధించడానికి పెద్దపెద్ద పరికరాలూ సాధనాలు లేకుండానే మహాత్ములు పురోగమిస్తారు-విజయాన్ని పొందుతారు కనకం! నాకంటే నీకు ఆర్థికంగా పెద్ద స్థితిగతులు లేకపోవచ్చు కాని భర్త అనురాగంలోనూ ఆత్మీయతలోనూ లోపం ఏమన్నా వుందా? అలాంటప్పుడు నీ శక్తివంచనలేకుండా నువ్వాయన్ను పువ్వుల్లోపెట్టి పూజించడం మానేసి నాతో వాదిస్తున్నావు సిగ్గులేదా-?"

తనకు నిజంగా సిగ్గులేదనే అనిపించింది కనకానికి. కాని ఏం చేస్తుంది? తనకలా పట్టుచీరెతో తులసికోటకు భర్త సౌభాగ్యాన్నికోరి పూజచేయడం చేత కాదు. పాదతీర్థం పుచ్చుకోవడం ఎరుగదు.

సౌందర్యకు బిడ్డలులేరు-

తనకలాకాదు ముగ్గురు బిడ్డలప్పుడే. ఆ సీనుగాడు డబ్బు పేకాటకూ తాగుడుకూ తగలేస్తే వారి గంజిమాటేమిటి?

కేవలం మోహనరావుగారింట్లో తన తిండి వెళ్ళితే సరా?

బిడ్డలు ఆల్లో లక్ష్మణా అని అల్లాడుతుంటే తనకెలా మనశ్శాంతి లభిస్తుంది?

మొగుడి నైచ్యాన్ని ఎలా సహించి పూరుకొంటుంది?? అందుకే సీనుగాడికి నాలుగు తగిలిస్తుంది-

'దొంగ వెధవా - నువ్విట్లా తాగుడు మానెయ్యకపోతే నేను మారుమనువు చేసుకొంటానని' బెదిరిస్తుంటుంది - నిజానికి అది జరిగేదీ, పొయ్యేదీ కాదని ఇరువురికి తెలుసు-

అయినా కనకానికి అంతకంటె చేతిలో వేరే ఆయుధాలు ఏమున్నాయి?

ఉన్నవన్నీ శక్త్యానుసారం ఒకదాని తర్వాత ఒకటి ప్రయోగిస్తుంది-ఏడుస్తుంది - రభసచేస్తుంది-

నలుగురినీ పిలిచి బజారులో పంచాయితిపెట్టి మొగుణ్ణి నేరస్థుణిగా ఉరిశిక్ష వేయదగ్గ ముద్దాయిగా నిరూపిస్తుంది.

బుద్ధిలేని జనమంతా పని మానుకోని ఈ ఉచిత వినోదాన్ని తిలకించి కనకాన్ని నాలుగుమాటలూ సీనుగాణ్ణి మరో నాలుగు కూతలుకూసీ ప్రతిఒక్కరూ ఒక న్యాయనిర్ణేతల్లా తమతమ జడ్జిమెంట్ ఈ పంచాయితీమీద పాస్‌చేసి వెళతారు-

అంతటితో ఆ ఘట్టం సమాప్తం-

మళ్ళీ మర్నాడు ఇలాంటి మరొకటి తయారు-

అందుకే కనకం అనుకున్నది- అన్నది కూడాను-

'మీ పాతివ్రత్యత వ్రతం నాకు ఈ జీవితంలో అసంభవం అమ్మగారూ- అందుకు దేవుడు నన్ను నరకానికి పంపినాసరే - ఇనుపకాకులతో పొడిపించినా సరే.'

x x x x

గోవిందరావు మళ్ళీ వచ్చాడు.

తలుపు తట్టాడు.

కనకం లోపల వంటమనిషికి సహాయపడుతున్నది-

సౌందర్య తానే స్వయంగా వెళ్ళి తలుపుతీసింది.

కళ్లు ఎర్రగా వున్నాయి-

ఎక్కడినుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు?

ఇవన్నీ అడిగే అధికారం సౌందర్యకు లేదు.

చెప్పవలసిన అవసరమూ గోవిందరావుకు లేదు-

నేరుగా లోపలికి వస్తూ అడిగాడు.

'తమ్ముడు లేడా?'

'ఇంట్లో లేరు.'

'ఎన్నింటికి వస్తాడు.'

'తొమ్మిది దాటుతుంది'.

'మంచిది - అయితే నాకు ముందే వడ్డించండి - ఆకలవుతున్నది'.

సౌందర్య కనకాన్ని పిలిచి బావగారికి కావలసిన సౌకర్యాలన్నీ చేయమని చెప్పి తన గదిలోకి వెళ్ళింది.

గోవిందరావు ఎవరికోసమూ ఎదురుచూడకుండానే షడ్రసోపేతమైన భోజనం ముందు తానే ముగించాడు.

భోంచేస్తూ మధ్యలో తలెత్తి కనకాన్ని ప్రశ్నించాడు 'అమ్మాయి ఏదీ'

'గదిలో వున్నారండీ'

'ఓహో - వంట చాలా బాగుందనిచెప్పు.' చెయ్యి కడుక్కొని మేడపైకి వెళ్ళి ఆరుబయట కూర్చున్నాడు.

కనకం పాన్‌దాన్ ఆయనముందు పెట్టింది.

ఆకులు నములుతూ అలా శూన్యాకాశాన్ని చూస్తూ కూర్చున్నాడు గోవిందరావు.

గోవిందరావు వచ్చాడంటే సౌందర్యకు భయం.

ఎప్పుడు వచ్చినాసరె ఆయనకు అవసరం వేల సంఖ్యలోనే వుంటుంది. మోహనరావు మారు మాట్లాడకుండా ఇచ్చి పంపుతూనేవుంటాడు.

ఈసారి మళ్ళి ఎందుకొచ్చాడో?

ఎంత తీసుకుపోతాడో??

అయినా సౌందర్య ఎన్నడూ భర్తనీవిషయం అడగలేదు - అవిభక్త కుటుంబంలో తాను జోక్యం కలుగజేసుకోవడం ఆదర్శాలకే విరుద్ధం అనుకున్నది.

అప్పుడప్పుడూ ఇంకా కనకమే అంటుండేది చూచాయగా మోహనరావుతో.

అయితే కనకం మాటలకు మోహనరావు గడ్డిపరకకిచ్చిన విలువకూడా ఇవ్వలేదు.

x x x x

విజయసారథి మంచి స్థితిపరుడు.

బాగా పలుకుపడి కల మనిషి.

లేకలేక అపురూపంగా చాలా ఆలస్యంగా గోవిందరావు కలగడంతో ఆ పిల్లవాణ్ణి అల్లారుముద్దుగా పెంచారు.

ఫలితంగా గోవిందరావుకు చదువు సంధ్యలు అబ్బలేదు. ఎప్పుడూ చీట్లాటా క్లబ్బులూ తాగుడూ. ఇలా తయారైనాడు.

గోవిందరావు పుట్టిన నాలుగేండ్లకే మోహనరావు పుట్టాడు. కాని మోహనరావు ముద్దూ ముచ్చటలు చూచుకునే అదృష్టం వరలక్ష్మమ్మకు ఎక్కువకాలం లేకపోయింది.

ఇటు భార్యపోయిన విచారం అటు పసిపిల్లవాణ్ణి సాకి పెంచి పెద్దచేయడం ఎలా? అన్న దిగులూ విజయసారథిని బాగా కుంగదీశాయి.

కనకం మోహనరావుకన్నా కొంచెం పెద్ద. గోవిందరావుకన్నా చిన్న.

కనకం తల్లిదండ్రులు కూడా వాళ్ళింట్లోనే చాకిరీ చేసుకొని బతికేవారు.

వాళ్లు కన్నుమూస్తూ కనకాన్ని వరలక్ష్మమ్మ చేతిలో పెట్టి పోయినందుకుగాను సొంతకుమార్తె లాగానే పెంచింది వరమ్మ కనకాన్ని.

అందుకు కృతజ్ఞతా సూచకంగానా అన్నట్లు వరమ్మ కన్నుమూశాక మోహనరావు పెంపకంలో కనకం ఎంతో శ్రద్ధ కనపరచేది.

తన వయస్సుకుమించిన శక్తిని పుంజుకొని తమ్ముణ్ని పెంచి పెద్ద చేసింది. తానూ ఒకవైపు పెద్దదవుతూ.

గోవిందరావు విద్యావంతుడైతే కొంత బాగుపడతాడేమోనన్న భావంతో విజయసారథి అతన్ని చదువులో ప్రవేశపెట్టాడు ఇంటిదగ్గర ముగ్గురు టీచర్లను పెట్టాడు. కాని నీటిపై వ్రాసిన అక్షరాల్లా విద్య అతనికి అబ్బలేదు. చదువువల్ల సంస్కారాలు పెరగకపోగా జులాయి వెధవల సాంగత్యం పట్టుబడి సాని కొంపలకు వెళ్ళడం మొదలుపెట్టాడు.

దీనికి ప్రతిక్రియగా పెండ్లిచేశాడు.

కాని ఈవర్షాకాలపు వెల్లువను శాంత గరికపోచలా ఆపి వుంచలేక పోయింది.

ప్రవాహ వేగానికి వంగిపోయింది.

లాపరీక్షలో 'అన్‌లాఫుల్ యాక్టివిటీ'కి దిగినందుకుగాను డిబార్ చేశారు గోవిందరావును.

అంతటితో అతని విద్యాజీవితానికి శాశ్వతంగా స్వస్తి.

'పీడా వదిలింది' అనుకొన్నాడు దీనితో.

జీవన్ముక్తి దొరికిన యోగిలా ఈ విద్యాబంధాలనుండి బయటపడ్డట్లు ఆనందించాడు.

విజయసారథికి తానింక ఎక్కువకాలం జీవించనని తోచింది.

మోహనరావును పిలిచి 'నీవు ప్రయోజకుడివి-బుద్ధివంతుడివి. అన్న సంగతి తెలిసిందేకదా! అందుకే వాడిచేతుల్లో నిన్ను పెట్టిపోవలసింది పోనిచ్చి నీ చేతుల్లో వాడిని అప్పగించి వెళ్తున్నాను. మీ గొంతుల్లో ఊపిరి వున్నంతవరకు విడివడకండి. ఒకరి నాశ్రయించుకొని ఒకరు బ్రతకండి.' అని చెప్పి అప్పగింతలు జరిపి ఆ తర్వాత సౌందర్య వచ్చాక కొంత కాలానికి కన్నుమూశారు.

ఒకరి నొకరు ఆశ్రయించుకోవడం అనే మాట కేవలం లాంఛనప్రాయమైనదే.

గోవిందరావునుఆశ్రయించుకొని మోహనరావు పనిచేయించుకొన్నక్షణాలు చాలా తక్కువ.

మోహనరావు తన పలుకుబడి నుపయోగించి గోవిందరావుకొక ఉద్యోగం ఇప్పించాడు. కాని అందులో అతను చేసిన అక్రమాలవల్ల గోవిందరావుఉద్యోగం పోవడమేకాదు వాటిని సరిదిద్దేసరికి మోహనరావు తల ప్రాణం తోకకువచ్చింది.

ఇదంతా చూచి ఒకరోజు గోవిందరావు అన్నాడు. 'తమ్ముడూ నావల్ల నీవెంతో శ్రమపడుతున్నావు' అందుకు చిన్నవాడినైనా నేను నిన్ను క్షమించమని కోరుకుంటున్నాను. ఇద్దరికీ పెళ్లిళ్ళయినాయి-ఇక సంసారాలు పెరుగుతాయి— ఒకరిమీద ఒకరు బరువు బాధ్యత ఉంచుకోవడం మంచిదికాదు-పంపకాలు చేసుకుందాము-చివరికి వచ్చిన దానితో వేరువేరుగా సంసారాలు చేసుకుందాము.

మోహనరావుకు విజయసారథి కళ్ళముందు మెదిలాడు. ఆయన చేతిలో తాను చెయ్యి వెయ్యడం ఓ చిత్రంలా కళ్ళకు కట్టింది-నిగ్రహంతో అన్నాడు.

'అన్నయ్యా! మంచికో చెడుకో అవిభక్తంగా వున్నాము-ఇవ్వాళ్ళ వేర్లు పడితే నలుగురూ నాలుగుమాటలంటారు-అటు తండ్రిపోగానే భార్యలువచ్చి కొడుకులను వేరుచేశారని అంటారు-సమాజానికి ఆ మాటలు వినడానికి చెవులూ, అనడానికి నోరూ మాత్రమే ఇచ్చాడు దేవుడు. హృదయం సమష్టికి చాలా తక్కువగా వుంటుంది-విడిగా ఒక్కొక్కడూ ఉత్తమంగావున్నవాడే, సామూహి

కంగా మందిలో నిలబడ్డాడనుకో.కొన్ని సందర్భాలలో వాడిలో సమష్టి చైతన్యం వికసిస్తుంది మాస్ మెంటాలిటీ) అప్పుడు వాడు పశువుగామారే అవకాశాలు కూడా లేకపోలేదు.పది నోళ్ళతో తన నోరు కలిపి ఉచితాను చిత్రాలు లేకుండా తిడతాడు.'

మోహనరావు చెప్పింది నిజమేకాని పూర్తి సత్యంకాదు.సమష్టి చైతన్యం పశుత్వం వైపుకేకాడు పరమేశ్వరత్వం వైపుకు కూడా నడుపవచ్చు.

విడిగా పశువుగా వున్నవ్యక్తే అసంఖ్యాకమైన ఉత్తములమధ్య నిలబడ్డప్పుడు తానూ ధర్మసూత్రాలు చెపుతాడు. సత్యాన్ని ఉపాసిస్తానని ప్రమాణాలు చేస్తాడు.

ఈ చర్చ మాట ఎలా వున్నా ఆస్తికి సంబంధించినంతవరకు అన్నదమ్ములు విడివడలేదు.

మోహనరావు తండ్రిమాటకు కట్టుబడ్డాడన్న సంగతి తెలియని శాంత దీన్ని మరిది బలహీనతగా భావించి సాధ్యమైనంత అతన్ని దోచుకోవాలని నిశ్చయించుకుంది,

'విడిబడితే ఏముంది? ఆ వున్న నాలుగు డబ్బులూ భార్య రంగురంగుల చీరెలకూ నగలకే చాలవు.అందుకే ఈ దొంగ నాటకమూ ఆ సౌందర్య విరగబాటునూ.ఎవరికి తెలియని భాగోతమిది.మనలాగా పొదుపుగా చేసుకునే సంసారమయితేనా? ఎంత ఉద్యోగముంచేనేం చిల్లికుండలో నీళ్లు పోసినట్లు'.అని మొగుణ్ని రెచ్చగొట్టింది ఫలితంగా గోవిందరావూ శాంతలకు పైతృకమైన ఇంటిని వదిలివేసి మోహనరావు వేరే అద్దెఇంట్లో వుంటున్నాడు. ఆస్తిపై ప్రతి సంవత్సరమూ వచ్చిన ఆదాయం చెరిసగమూ పంచుకుంటారు.

అయితేనేం ఉద్యోగంలేని గోవిందరావుకు ఈ డబ్బులు చిల్లపెంకుల్లా ఖర్చైపోవడానికి ఎంతకాలం పట్టాలి?

అందుకే తమ్ముడి ఇల్లు ఒక ఖజానాగా భావించి ఎప్పుడుపడితే అప్పుడు వస్తాడు.

ఇచ్చినంత తనకు నచ్చినంత గుంజుకొని పోతూవుంటాడు మధ్యమధ్య-

x x x x

సౌందర్యకు మెలకువ వచ్చేసరికి తీవ్రంగా మాటలు వినవడుతున్నాయి.

'అయ్యగారూ, మీరాయనకు ఒక్క పైసాకూడా ఇవ్వడానికి వీలులేదు-అమ్మ వూరుకొంది కదా అని నేనూరుకోను-' గోవిందరావు ఖిన్నుడై పోయాడు-

'ఛీ! వెధవ బ్రతుకు - చివరకు పనిమనిషిచేత కూడా మాటలనిపించుకోవలసి వచ్చింది- ఇంతకన్నా చావడమే మంచిది.'

'అంత బుద్దేవుంటే చావడ మెందుకు? తాగుడూ తిరుగుడూమాని బుద్ధిగా ఉద్యోగమే చేసుకోవచ్చుగా - జలగలా మమ్మల్ని పీడించడం దేనికి?'

మోహనరావు ఉద్రేకంలో కనకాన్ని ఫెడీఫెడీమని కొట్టాడు-

కనకంపై మోహనరావు చెయ్యి చేసుకోవడం అదే మొదటిసారి-

'అమ్మగారు పతివ్రతకదా అని అలుసుతీసుకొని అన్యాయం చేస్తుంటే అడ్డం వచ్చినందుకు మంచిగానేచేశారు అయ్యగారూ - నాకు తన్నులు పడవలసిందే-' ఏడుస్తూ గది విడిచి వెళ్ళింది కనకం-

మోహనరావు దుఃఖితుడైనాడు - అతని మనస్సు క్షోభించిపోయింది-ఎన్నడూ కనకంపై చెయ్యిచేసుకోలేదు తన చిన్నప్పటినుండి.

కాని ఇవ్వాళ ఇలా....

మాట్లాడకుండా ఇనప్పెట్టెలోంచి పది వందరూపాయల నోట్లు తీసి ఇచ్చి 'అన్నయ్యా ఇవి తీసుకొనివెళ్ళు' అన్నాడు.

'చాలవు - పదిహేనువందలు కావాలి '

ఈ వెయ్యి రూపాయలూ తన సంపాదనలోనుంచే ఇచ్చాడు మోహనరావు-

ఇంకా మరో అయిదువందలు కూడాను-మారుపలకకుండా మరో అయిదు వందలుకూడా తీసి ఇచ్చాడు - రెండుచేతులూ ఎత్తి నమస్కరించి 'అన్నయ్యా డబ్బు ఇక దుబారాచెయ్యకు - నేనీఖర్చు భరించలేను - ఇక మళ్ళీ నాదగ్గరకు రాకు-'

పదిహేనువందలు ఇచ్చినా తనదగ్గరికి రావద్దన్నమాట శూలంగా గుచ్చుకొంది గోవిందరావుకు-

'ఇదేదో ముష్టిలా నాకివ్వకపోతే ఆ పొలాలు ఫిక్సెడ్ మొత్తాలూ పంచుకుంటే సరిపోదూ-'

నిమిషానికొకసారి గోవిందరావూ శాంతి తన నిజాయితీని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు - ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారు - తండ్రికిచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తన ఆదర్శాన్ని బలహీనతగా భావించి తన్ను వంచిస్తున్నారు-

మోహనరావు ఇక భరించలేకపోయాడు.

'అలాగే అన్నయ్యా, రేపే రామకృష్ణకు కబురుపెట్టా - ఎవరిదివారు పంచుకుందాము.'

రామకృష్ణ వాళ్ళ ఇంటి వకీలు.

తమ్ముడు పంపకాలకు ఒప్పుకుంటాడని గోవిందరావు కలలోకూడా అనుకోలేదు. అందువల్ల ఆమాట అతనికి నీరులేని మేఘంనుండి నిప్పురవ్వ రాలినట్లు తోచింది.

ఒక్కక్షణం అప్రతిభుడై పోయినాడు.

పంచుకొంటారు.

గోవిందరావు ఆస్తి గోవిందరావుకు వస్తుంది___

మొత్తం కొన్నేళ్ళు హాయిగా ఖర్చుచేసుకోవచ్చు. ఆ తర్వాత అయినా తమ్ముడు తనకు డబ్బివ్వకపోతాడా మళ్ళీ___

తాను తిండికిలేక బికారిగా తిరుగుతుంటే అది మోహనరావుకు మాత్రం ఏమి గౌరవం?

కాబట్టి పంపకాలు అయినతర్వాత కూడా తనకు తమ్ముడు ఉద్యోగంచేసి రెండు దోసెళ్ళతో సంపాదించినదాన్లో ముట్టచెప్పకుండా ఊరుకోడు.

అలాంటప్పుడు పంపకాలు తనకు మంచిగానే తోచింది.

తల ఆడించి మాట్లాడకుండా మెట్లు దిగాడు.

సరిగ్గా గోవిందరావు ఏమనుకున్నాడో అదే అనుకున్నాడు మోహనరావు-

పంపకాలు అయిన తర్వాతకూడా తన్ను పీడించక మానడు.

తాను ఇవ్వక తప్పదు.

ఇవ్వడూ, తండ్రి ఆత్మకు శాంతి లభిస్తుందా పెద్దకొడుకు తిండికిలేక తిరుగుతుంటే?

నీతికీ వాస్తవానికీ మధ్య జరుగుతున్న సంఘర్షణలో మోహనరావు తట్టుకోలేకపోయాడు.

గోవిందరావు వెళ్ళాక సౌందర్య వచ్చి భర్తను భోజనానికి రమ్మన్నది.

'వెళ్లు - నా కాకలిగాలేదు' విసుక్కున్నాడు.

సౌందర్య మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళింది.

కనకం పక్కకూడా లేకుండా అలాగే నేలమీద ఓమూల పడుకున్నది కన్నీరు చెంపలపైనుండి జారగా.

x x x x x

తెల్లవారింది.

సౌందర్య బ్రతుకు తెల్లవారింది.

అంతా తలోమాట, తలో ఆరోపణ తలొక ఫిర్యాదు.

మార్ఫియా మింగేపోయాడు.

'ఏడిశావు - స్లీపింగ్ పిల్స్ మార్ఫియాలతో పోయాడంటే నాకు నమ్మకం లేదు - ఆ గోవిందరావే డబ్బివ్వలేదని ఏదో చేసి వుంటారు.'

'ఎంతఘాతుకం - ఎంత అక్రమం.

'రామలక్ష్మణుల అనురాగం కేవలం కథల్లోనేకాని లోకంలో వున్నదంతా రావణాసురుడూ నిభీషణుడేనయ్యా ' ఎన్నో వ్యాఖ్యానాలు—ఎన్నో విమర్శలు—పరామర్శలు.

సౌందర్య ఏడుస్తున్నదా?

కన్నీటి ప్రవాహంలో ఆమె బుద్ధి మనస్సు ఆత్మ కొట్టుకొనిపోయాయా? హృదయాగ్నికి దహనమై బూడిదగా మారాయా?

ఏమో!

ఎవరికి తెలుసు?

కనకం పరీక్షించి చూచి ఆమె సజీవంగానే వున్నదని నిశ్చయించుకున్నది.

పతివ్రతలు భర్త మరణవార్త వినగానే ప్రాణత్యాగం చేస్తారని కథల్లో విన్నది.

సౌందర్య చెప్పడమూ గుర్తున్నది.

కాని సౌందర్యకు ప్రాణం పోలేదు.

ఇది కలియుగం.

ధర్మం ఒంటిపాదంమీదనే నడుస్తున్నది.

లేకుంటే సౌందర్య ఇంకా సజీవంగానే వుండటమేమిటి??

ఇప్పుడూరుకుంటే సర్వనాశనమవుతుందని కనకం నిశ్చయించుకున్నది.

తన కర్తవ్యం ఆమెను వెన్నుతట్టి లేపింది.

లేచి సౌందర్యను ఊరడించింది.

అందుకేమి చెప్పిందో ఎలా చెప్పిందో ఏకథకుడూ వర్ణించలేనంతనై పుణ్యం ఏమి ప్రదర్శించిందో ఎవరికి తెలుసు?

సౌందర్య లేచి కూర్చున్నది.

మూర్తీభవించిన శోకదేవతలా లేచి నిలబడింది.

జీవచ్ఛవంలా లేచి నడిచివెళ్ళింది బీరువావద్దకు.

ఈలోపల డాక్టర్లు రావడం శవపరీక్షచేయడం స్లీపింగ్‌పిల్స్ ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడని రిపోర్టులు రావడం శవాన్ని తిరిగి బంధువుల కప్పగించడం అంతా జరిగాయి.

మోహనరావు దేహాన్ని ఇంటికి తెచ్చారు.

ఈలోపలే లాయరుతోసహా శాంతా గోవిందరావు వచ్చి కూర్చున్నారు.

ఆ స్తిపాస్తుల వివరాలు అడుగుతున్నాడు లాయరు రామకృష్ణ.

కనకం జవాబుచెప్పింది 'రామకృష్ణగారూ దీనికిది సమయంకాదు - దయతో దహనకాండా ఆ పన్నెండు రోజుల వ్యవహారమూ ముగియనివ్వండి.'

'అలా వీలులేదు - భర్తకు ఘనంగా అంత్యక్రియలు జరగాలనే నెపంగా ఆ స్తంతా ఆసౌందర్య దుర్వినియోగంచేస్తే మాగతి ఏంకావాలి ఆ ఉన్నదేదో ముందు నగదూ బంగారం తేలనివ్వండి' శాంతి అన్నది.

'ఏమీలేదు - మీకిక్కడ ఒక్క దమ్మిడీ ఆస్తిలేదు - నోరుమూసుకొని వెళ్ళడం మంచిది' కనకం రోషంతో బదులిచ్చింది.

'ఇది మా ఇంటి వ్యవహారం - మధ్యలో పనిమనుషులూ, దాసీవాళ్ళూ కలుగజేసుకోవడం మాకు పరువుతక్కువ' శాంత గద్దించింది.

'శవాన్ని బయటపెట్టి వాటాలు పంచుకునే మీకు పరువుకూడా ఒకటి వున్నదన్న మాట.'

కనకం అన్న ఈ మాట దోసెడు నిప్పులను రాల్చింది.

రామకృష్ణ అందుకున్నాడు 'అమ్మాయ్ సౌందర్యా-నువ్వు మాట్లాడమ్మా.'

సౌందర్య వచ్చింది - కాని మాట్లాడలేదు.

మాట్లాడడానికి ఆమెలో ఇంకా ఇంద్రియజ్ఞానం ఉన్నదో లేదో?

'చూడమ్మా-మీరు వేరువేరు ఇళ్ళల్లోవున్నా చట్టం దృష్ట్యా అవిభక్త కుటుంబం కిందనే లెక్క-అందుకనే స్థిరాస్తులు చరాస్తులూ కలిసి లెక్క చూడాల్సిందే.'

'బావగారింటినుంచి వస్తున్నారా?' ఆయన చివరకు ఇలా ప్రేరేపించాడా అని ఒక భావం-మా ఆస్తి లెక్క చూడడానికి వచ్చావు మరి ఆయన ఇంటిని నీ ఏచేసి వచ్చారా? అని మరొక అర్థం.

బావతో కలిసివచ్చిన వాడిని ఆయనకన్నా ఉదాత్తమైన గుణాలు ఎలా వస్తాయి? అని ఇంకోధ్వనీ.

ఇన్నీ స్ఫురించాయి సౌందర్య అన్న ఆ చిన్న మాటలోనూ గోవింద రావుకు శాంతకు రామకృష్ణకు.

సౌందర్యే మళ్ళీ అన్నది 'ఉన్న స్థిరాస్థి తెలిసిందే-భాగాలు పంచండి తర్వాత చరాస్థి అంటూ ఏమీలేదు ఆయన, ఉద్యోగంచేసి సంపాదించిన ఈ సామాను మినహాయిస్తే.'

'అది కాదమ్మా-రొక్కమూ బంగారమూ వగైరా'

'అలాంటి వేమీలేవు.'

నిర్ఘాంత పోయాడు గోవిందరావు

'అబద్ధం-ఏడువారాల నగలుండాలి-బోలెడంత కాష్-వెండి సామాను'

సౌందర్య తలెత్తి ఒక్క చూపు చూచింది.

ఆ చూపుకు రుద్రుని మూడోకంటి వేడేవుంటే గోవిందరావు బూడిదగా మారేవాడే ఎప్పుడో.

'ఛీ నీచుడా! తమ్ముడి స్వార్జితంతో మరదలికి పెట్టిన బంగారాన్ని భాగాలకు పంచమని వచ్చావు నీవు మనిషివేరా' అని కొరడాతో చెళ్ళున వీపుపై మోది నట్లనిపించింది ఆ చూపులతో గోవిందరావుకు.

'రామకృష్ణగారూ-మాకు గోవిందరావుగారి అప్పులు చాలా వున్నాయి-అవన్నీ తీర్చాల్సిందే-అది జరిగేవరకూ ఆస్తి పూచికపుల్ల ఖర్చుపెట్టడానికి వీలు లేదు సీళ్లు వెయ్యండి ఇంటికి.'

రామకృష్ణ న్యాయపద్ధతిలో ఇల్లు పరీక్షించాడు.

ఇంట్లో ఒక నగలేదు.

ఎక్కువ విలువైన వస్తువులేదు-కాష్ చిల్లిగవ్వలేదు-

మోహనరావు శవదహనం ముందు సమస్యగా మారింది.

గోవిందరావు మరదలి దగ్గరికివచ్చి అడిగాడు 'అమ్మాయ్-నలుగురిలో ఇప్పుడు నవ్వులపాలౌతున్నాము-ఆ డబ్బు ఎక్కడ దాచావో చెప్పు, కనీసం దహనకాండకన్నా కొంత రొక్కం నాచేతికియ్యి'

సౌందర్య నవ్వింది-

విచిత్రమైన నవ్వు

ఎవ్వరూ వ్యాఖ్యానం చెప్పలేని కన్నీటి నవ్వు-భర్తను అల్లరిపాలు చేయ డానికై అప్పుల వాళ్ళతోసహా వచ్చిన బావ తన్ను నవ్వులపాలు కాకుండా రక్షించమని డబ్బు అర్థిస్తున్నప్పుడు నవ్విన నవ్వు-

సౌందర్య నవ్వు గోవిందరావుకు పిదప కాలిచెప్పు దెబ్బలా తగిలింది.

మోహనరావు ఆఫీసుస్టాఫ్ అంతావచ్చారు

అందరూ సానుభూతి చూపారు.

తలా ఒకమాటా అనుకున్నారు.

మునిసిపాలిటీ బండిలో స్మశానం చేరవేసి దహనం అయిందనిపించారు.

పతివ్రత భర్త అనాథ ప్రేతంలా చందాలతో దహింపబడ్డాడు.

ముష్టెత్తిన పైసలతో చెలరేగిన అప్రతిష్ఠలాగా మంటలు భగభగలేచాయి.

కనకం ఇంట్లో దాగిన ఏడువారాల నగల బంగారంలాగా మంటలు మిల మిలా మెరిశాయి.